# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 15-5-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 226 | పేజీలు:4 | వెల: రూ.1/-


## ఖార్కివ్‌ను చేజిక్కించుకున్న ఉక్రెయిన్..

కీవ్, మే 14: రష్యా సరిహద్దుల్లో ఉన్న ఖార్కివ్ పట్టణాన్ని మళ్లీ ఉక్రెయిన్ చేజిక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఆ నగరంలో ఉన్న రష్యా దళాల్ని ఉక్రెయిన్ సైన్యం సమర్థవంతంగా వెనక్కి పంపిస్తోంది. ఆ సిటీ కోసం జరిగిన పోరులో తాము గెలిచినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. ఖార్కివ్ సిటీ నుంచి శత్రు దేశ దళాలు వెనుదిరుగుతున్నట్లు ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ పేర్కొన్నారు. గడిచిన రెండు వారాల నుంచి ఖార్కివ్ ప్రశాంతంగా ఉన్నట్లు ఓ వార్త సంస్థ జర్నలిస్టులు తెలిపారు.

అయితే ఖార్కివ్ సమీప ప్రాంతాలపై మాత్రం రష్యా ఇంకా బాంబు దాడులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఖార్కివ్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న డెర్‌గాచీ వద్ద శుక్రవారం దాడులు జరిగాయి. అక్కడ ఉన్న ఓ ఆయుధ డిపోపై రష్యా దళాలు దాడి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఉక్రెయిన్‌పై ఆక్రమణకు వెళ్లిన రష్యాకు ఖార్కివ్ నగరాన్ని హస్తగతం చేసుకోవడమే ప్రధాన టార్గెట్. ఆరంభంలో ఆ నగరంపై భీకర దాడులు జరిగాయి. అయితే రష్యా ఆక్రమణ నుంచి దేశానికి విముక్తి లభించే విధంగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఖార్కివ్‌లో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో.. ప్రజలు ఇండ్లకు చేరుకుంటున్నట్లు ఆ రాష్ట్ర గవర్నర్ తెలిపారు. తమ దేశ సైనిక దళాలు రష్యా సైన్యాన్ని వెనక్కి పంపిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో రష్యన్లు ఎక్కువగా మైన్లు ఏర్పాటు చేశారని, ఇండ్లకు తిరిగివస్తున్న సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

## అమిత్ షా జీ.. తెలంగాణకు ఏమిచ్చారో చెబుతారా.. ఎమ్మెల్సీ కవిత ప్రశ్నల వర్షం

హైదరాబాద్, మే 13: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై చూపుతున్న వివక్షపై సమాధానం చెప్పాలని కేంద్రమంత్రి అమిత్ షాను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేడు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బిడ్డలకు కేంద్రం ఏమిచ్చిందో బెబుతారా అంటూ వివిధ అంశాలపై ట్విటర్ వేదికగా ప్రశ్నించారు.

తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్లకు పైగా ఉన్న ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని నిలదీశారు. వెనుకబడి ప్రాంతాల అభివృద్ధి గ్రాంటు రూ.1350 కోట్లు, జీఎస్టీ పరిహారం రూ.2247 కోట్ల జీఎస్టీ పరిహారం సంగతేమిటని కవిత ప్రశ్నించారు. గత ఎనిమిదేండ్లలో తెలంగాణకు ఒక్క ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్‌ఈఆర్, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐడీ, మెడికల్ కాలేజీలు, నవోదయ పాఠశాలలు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు విఫలమైందో తెలంగాణ బిడ్డలకు వివరించాలని కవిత డిమాండ్ చేశారు.

మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు రూ.24 వేల కోట్లు ఇవ్వాలన్న నీతి ఆయోగ్ సిఫార్సును కేంద్ర ప్రభుత్వం ఎందుకు విస్మరించిందో చెప్పాలని కోరారు. కర్ణాటకలోని ఎగువ భద్ర నీటిపారుదల ప్రాజెక్టుకు, కెన్ బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా నిరాకరించడం కేంద్రప్రభుత్వం కపటత్వం కాదా? అంటూ ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు. అంతేకాదు బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెరిగిన నిరుద్యోగం, మతపరమైన అల్లర్లపై, భారత్‌ను అత్యంత ఖరీదైన ఇంధనం, ఎల్‌పీజీని విక్రయించడంలో అగ్రగామి దేశంగా మార్చడంపై, ఆకాశాన్ని తాకుతున్న ద్రవ్యోల్బనంపై మీ సమాధానం ఏమిటని కేంద్ర మంత్రి అమిత్ షాను ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు.

## సనత్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించనున్న మంత్రులు

హైదరాబాద్, మే 13: సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్‌పేట డివిజన్ బండ మైసమ్మనగర్‌లో రూ.27.20 కోట్ల వ్యయంతో 310 డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రభుత్వం నిర్మించింది. వాటిని మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూంలో సకల సదుపాయాలు కల్పించింది. తాగునీటికి ఇబ్బందులు లేకుండా సంప్ నిర్మాణంతో పాటు డ్రైనేజీ, సీసీరోడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించారు. అలాగే 11 లిఫ్టులను సైతం ఏర్పాటు చేశారు. మంత్రులు డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించి, లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించి, అందజేయనున్నారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యం : డీజీపీ మహేందర్‌రెడ్డి

రాజన్న సిరిసిల్ల, మే 14:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో శాంతిభద్రలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, ఇందులో భాగంగా జిల్లా పోలీస్, కమిషనర్ కార్యాలయాలను కొత్త జిల్లాల్లో నిర్మిస్తున్నట్లు డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పోలీస్ కార్యాలయాల సముదాయాన్ని శనివారం తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ జైన్, పోలీస్ హౌసింగ్ బోర్డ్ ఎస్పీ చేతన్‌తో కలిసి నూతన భవనాల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా నిర్మాణ దశలో పెండింగ్‌లో ఉన్న పనుల వేగవంతానికి చేపట్టాల్సిన చర్యలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ప్రజలకు సత్వర పోలీస్ సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్ని హంగులతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాల సముదాయాలను నిర్మిస్తుందని, వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్స్, డిజైనర్స్, ఆర్కిటెక్చర్స్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీలో చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

త్వరలోనే ప్రజలకు వాటిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. తర్వాత పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం బడ్జెట్‌లో పోలీస్‌శాఖకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖలో మొదటి ప్రాధాన్యతగా రాష్టంలో అన్ని పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, తర్వాత పోలీస్ అధికారులు ఉండేందుకు క్యాంప్ కార్యాలయాలు పోలీస్ సిబ్బంది ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ విజయ్ కుమార్, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు ఎస్పీ చందయ్య, ఇన్‌చార్జి డీఆర్వో టీ శ్రీనివాస రావు, డీఎస్పీ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ ఆర్థిక పుష్టికి వంతెన
లార్థుకు కాటను రచించి యాంధ్రావనికే
మార్గమ్మాయె. ఘనుడై
ప్రార్థితుడై నిలచె నాడు ప్రజల మనములనే!

(మె 15
సర్ ఆర్థర్ కాటన్ జయంతి..)

–రాధశ్రీ
సెల్: 9494481210



## 2072 వరకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ప్లాన్ : మంత్రి కేటీఆర్

నల్లగొండ, మే 13: హైదరాబాద్ నగరానికి 2072 వరకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ముందు చూపుతో ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. వరుసగా ఏడేండ్లు కరువు వచ్చినా తాగునీటికి తిప్పలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూతా కూడా వాటర్ పైప్ లైన్‌లను ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో హైదరాబాద్ నగరం 100 కిలోమీటర్ల విస్తరించిన తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలా, బయట ఉన్న ప్రాంతాలకు కూడా తాగు నీటిని అందించేలా ప్లాన్ చేశామన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల నిమిత్తం.. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ వద్ద సుంకిశాల ఇన్‌టెక్ వెల్ పనులకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాల ప్రజలకు నిజంగా ఇవాళ శుభదినం అని పేర్కొన్నారు. మెట్రో వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డు ఆధ్వర్యంలో రూ. 6 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుత హైదరాబాద్‌లో నీటి అవసరాలు 37 టీఎంసీలు.. 2072 వరకు ఆలోచిస్తే ఇది పెరిగి మరో 34 టీఎంసీల అవసరం ఉంటుంది. దాదాపు 71 టీఎంసీల నీరు అవసరం ఉండే అవకాశం ఉంది. 2035 నాటికి 47 టీఎంసీలు, 2050 నాటికి 58 టీఎంసీలు, 2065 నాటికి 67 టీఎంసీలు, 2072 నాటికి 70.97 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని అంచనా వేశామన్నారు. సుంకిశాలలో 1450 కోట్ల అంచనా వ్యయంతో తాగునీటి అవసరాల నిమిత్తం పంపులు, మోటార్లతో పాటు అదనంగా 16 టీంఎసీలు లిఫ్ట్ చేయడానికి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రాబోయే ఎండకాలం నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి హైదరాబాద్ ప్రజలకు తాగునీరు అందిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



## ఆయనకు విందులు, చిందులే తెలుసు.. రాహుల్‌పై కేటీఆర్ ఫైర్

నల్లగొండ, మే 13:కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై మంత్రి కేటీఆర్ మరోసారి నిప్పులు చెరిగారు. ఆయనకు రైతులు, ఎడ్లు, వడ్లు తెల్వదు.. విందులు, చిందులు మాత్రమే తెలుసని కేసీఆర్ మండిపడ్డారు. నాగార్జున సాగర్ నియోజకవర్గం పరిధిలోని హాలియా, నందికొండ మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా హాలియాలో ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. వరంగల్ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ మాకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అడిగిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేస్తూ నిప్పులు చెరిగారు. ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన పెద్దాయనకు ఎన్నిసార్లు అవకాశం ఇచ్చారు. ఏడు సార్లు అవకాశం ఇచ్చినా ఏం ఉద్ధరించలేదు. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీకి 10 సార్లు అవకాశం ఇచ్చారు.. 50 ఏండ్లు వారే పరిపాలించారు. 50 ఏండ్లు ఏం చేయలేనోడు.. ఇంకొక్క చాన్స్ ఇవ్వండని అడుగుతుండు. రైతు సంఘర్షణ సభ కాదు.. అది కాంగ్రెస్ నేతలు ఒకరికొకరు తన్నుకుంటున్నారు. ప్రజలను, రైతులను అయోమయానికి గురి చేసే దిక్కుమాలిన కథ అని కోపోద్రిక్తులయ్యారు.

ఫ్లోరోసిస్ ను ఎందుకు అరికట్టలేదు. రైతుబంధు, రైతుబీమా ఎందుకు ఇవ్వలేదు. నెల్లికల్ లిఫ్ట్‌ను ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రశ్నలకు వారి నుంచి సమాధానం రాదు. ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప మనం అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చే పరిస్థితి లేదు. సాగర్ నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా కేసీఆర్ ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్నారు. నాగార్జున సాగర్ అభివృద్ధిలో ముందుకు పోతోంది. డిగ్రీ కాలేజీ ఇస్తానని చెప్పారు. అది కూడా ఇచ్చారు.. ఆ పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు అన్ని పనులు అభివృద్ధి పథంలో ఉన్నాయని కేటీఆర్ తెలిపారు.

### దయచేసి వారిని విశ్వసించొద్దు..

సంక్రాంతికి గంగిరెద్దులు వచ్చినట్లు మళ్లీ ఆ పార్టీల నాయకులు వస్తరు.. ఎన్నికలు రాగానే ఊపుకుంటూవచ్చి ఉపన్యాసాలు ఇస్తరు. గతంలో చేసిందేమీ లేదు కానీ మా తాతలు నేతులు తాగింద్రు, మా మూతుల వాసనలు చూడండి.. మేం చాలా పెద్దవాళ్లం.. ఏడెనిమిది సార్లు మేం ఏమో చేసినం అని చెప్పడానికి వస్తరు. దయచేసి వారిని నమ్మొద్దు.. విశ్వసించొద్దని నియోజకవర్గ ప్రజలకు కేటీఆర్ సూచించారు.

### భగత్‌ను కాపాడుకోండి..

వీళ్లందరిని చూసి చూసి, వీళ్ల అసమర్థతను తిరస్కరించి చాకు లాంటి నాయకుడికి అవకాశం ఇచ్చారు. మీ నాయకుడిని కాపాడుకోండి.. ఉజ్వలమైన భవిష్యత్ ఉన్న నాయకుడు.. బ్రహ్మాండంగా సేవలందించే నాయకుడు నోముల భగత్ అని కేటీఆర్ ప్రశంసించారు. మీకు ఏ సమస్య వచ్చినా.. మీ ఇంటి ముందు వాలిపోయే యువ నాయకుడు భగత్ అని కేటీఆర్ పేర్కొన్నారు. అలాంటి నాయకుడితో పది కాలాల పాటు సేవ చేయించుకోండని కేటీఆర్ సూచించారు.

## వేములవాడ రాజన్నను దర్శించుకున్న డీజీపీ మహేందర్‌రెడ్డి



రాజన్న సిరిసిల్ల, మే 14:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ కల్చరల్ : వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కోలేటి దామోదర్‌తో కలిసి రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం ఆలయ అద్దాల మండపంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో ఎస్పీ రాహుల్ హెగ్డే ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వేములవాడ డీఎస్పీ చంద్రకాంత్, పట్టణ సీఐ వెంకటేశ్, ఆలయఅధికారులు పాల్గొన్నారు.

## సనత్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించనున్న మంత్రులు

హైదరాబాద్, మే 14: సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్‌పేట డివిజన్ బండ మైసమ్మనగర్‌లో రూ.27.20 కోట్ల వ్యయంతో 310 డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రభుత్వం నిర్మించింది. వాటిని మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూంలో సకల సదుపాయాలు కల్పించింది. తాగునీటికి ఇబ్బందులు లేకుండా సంప్ నిర్మాణంతో పాటు డ్రైనేజీ, సీసీరోడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించారు. అలాగే 11 లిఫ్టులను సైతం ఏర్పాటు చేశారు. మంత్రులు డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించి, లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించి, అందజేయనున్నారు.

## ఊదు కాలది.. పీరి లెవ్వది అన్నట్లే ఆ రెండు పార్టీలు కూడా : ఎర్రబెల్లి ఎద్దేవా



వరంగల్,మే 13 వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, బీటీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ విధానాలపై మండిపడ్డారు. బోగస్ మాటలు, కిరికిరి చేష్టలతో కాంగ్రెస్ దేశాన్ని పాలించిందని, చేసిందేమీ లేదని విమర్శించారు. ఇప్పుడు బీజేపీ అధికారంలో వుందని, ఆ పార్టీ కూడా చేసిందేమీ లేదని దెప్పిపొడిచారు. ఈ రెండు పార్టీలతో ఒరిగిందేమీ ఉండదన్నారు. ఊదు కాలదు.. పీరీ లెవ్వదు అన్న చందంగా ఆ పార్టీల పరిస్థితి తయారైందని చురకలంటించారు.

బీజేపీ, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే నిండా మునిగిపోతామని మంత్రి ఎర్రబెల్లి చెప్పుకొచ్చారు. ఆ రెండు పార్టీలు అధికారంలో వున్న రాష్ట్రాల్లో చేసిందేమీ లేదని, తెలంగాణకు వచ్చి ఏమో చేస్తామని గొప్పలకు పోతున్నారని విరుచుకుపడ్డారు. ఇక్కడికి వచ్చి, బడాయి మాటలు చెప్పడం మాని, పాలిత రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారో చెప్పాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధితో నే, దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఇదే స్ఫూర్తి తో సీఎం కెసిఆర్ పరిపాలన చేస్తున్నారు. అందరినీ సంతృప్తి పరచడం అమ్మా నాయినలకే సాధ్యం కాదు. కాబట్టి ఒక్కొక్కటిగా అన్నీ పనులను పూర్తి చేసుకుందాం. మీ అభివృద్ధి నా బాధ్యత. దయన్న గా మీ అందరినీ కాపాడుకుంటాను అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చెప్పారు.

## ఢిల్లీ అగ్నిప్రమాదం.. 24 మంది మహిళలు మిస్సింగ్

న్యూఢిల్లీ, మే 14: దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం ఘోర విషాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ముండ్కా ఏరియాలోని ఓ నాలుగంతస్తుల వాణిజ్య భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించి 29 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 24 మంది మహిళలతో పాటు ఐదుగురు పురుషుల ఆచూకీ లభించలేదు. ఆచూకీ లభించని వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 14 మంది గాయపడగా, 13 మందికి చికిత్స అందించి డిశ్చార్జి చేసినట్లు పేర్కొన్నారు.

డీఎన్ఏ శాంపిళ్ల సేకరణ..

అయితే ఇప్పటి వరకు లభించిన మృతదేహాల్లో 25 మంది మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

ఈ 25 డెడ్‌బాడీల గుర్తింపునకు డీఎన్ఏ శాంపిళ్లను ఫోరెన్సిక్ అధికారులు సేకరించారని పేర్కొన్నారు. డీఎన్ఏ టెస్టుల అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు.

అగ్నిప్రమాదం జరిగిన సమయంలో 50 మంది..!

అగ్నిప్రమాదం సంభవించిన అంతస్తులోని ఓ గదిలో 50 మంది ఉన్నట్లు ఫైర్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మిస్సింగ్ అయిన వారి ఆచూకీ కోసం చర్యలు చేపట్టామన్నారు.

మీటింగ్‌లో ఉండగానే అగ్నిప్రమాదం..

అగ్నిప్రమాదంలో గాయపడిన ఓ మహిళ సంజయ్ గాంధీ మెమోరియల్ ఆస్పత్రి నుంచి విడుదలైన అనంతరం మీడియాతో మాట్లాడారు. మేం మీటింగ్‌లో ఉండగానే అగ్నిప్రమాదం సంభవించింది. బయటకు వెళ్లేందుకు అక్కడ దారి లేదు. ఒకే ఒక్క ఎగ్జిట్ ఉన్నప్పటికీ అక్కడ మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన థర్డ్ ఫ్లోర్‌లో మొత్తం 250 నుంచి 300 మంది ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

కరెంట్ పోయినా క్షణాల్లోనే పొగలు..

మేం మీటింగ్‌లో ఉండగానే కరెంట్ పోయింది.. ఇక క్షణాల్లోనే పొగలు వ్యాపించినట్లు మరో బాధితురాలు పేర్కొన్నది. గట్టిగా కేకలు వేస్తూ కిటీకిలు పగులగొట్టి తాళ్ల సహాయంతో బయటకు వచ్చినట్లు తెలిపింది. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడినట్లు ఆ మహిళ చెప్పింది.

అగ్నిప్రమాదం సంభవించిన ముండ్కా ఏరియాను ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శనివారం ఉదయం పరిశీలించారు. ఈ ఘటన పట్ల కేజ్రీవాల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఆర్థిక సాయం చేయనున్నట్లు సీఎం ప్రకటించారు.

## జనగామ ఎంసీహెచ్‌ని సందర్శించిన మంత్రి హరీశ్‌రావు.. సేవలపై ఆరా..

జనగామ, మే 14: జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంక్షేమ దవాఖానను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నకిరేకల్ నుంచి తిరిగివస్తున్న క్రమంలో మార్గమధ్యంలో జనగామ ఎంసీహెచ్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రోగుల వద్దకు వెళ్లి దవాఖానాలో అందిస్తున్న సేవలు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. రోగులతో ఆత్మీయంగా మాట్లాడుతూ.. దవాఖాన మొత్తం కలియ దిరిగారు. మంత్రి హరీశ్‌రావును చూసి రోగులు సంతోషం వ్యక్తం చేయగా.. ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, సేవలపై రోగులు, వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ కిట్, మందులు, భోజనం సరిగా పెడుతున్నారా? లేదా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు లోపాలను గుర్తించిన మంత్రి అక్కడి నుంచే వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వాకాటి కరుణతో ఫోన్‌లో మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను నివేదిక కోరిన మంత్రి.. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




సాహితీ కిరణం

సాహితీకిరణం సౌజన్యంతో చి॥ జాహ్నవి కొసరాజు(అన్యతాసి) స్మారక జాతీయస్థాయికవితలపోటీ

చి॥ జాహ్నవి కొసరాజు (అన్యతాసి) వర్ధంతి (జులై 15) సందర్భంగా సాహితీకిరణం సౌజన్యంతో నిర్వహిస్తున్న కవితలపోటీకి కవులు/కవయిత్రులనుండి కవితలను ఆహ్వానిస్తున్నాము. ఈ పోటీలో 7 బహుమతులుంటాయి

బహుమతి వివరాలు:

ప్రథమ బహుమతి:రూ॥3000/-,

ద్వితీయ బహుమతి రూ॥2000/-

ఒక్కొక్కటి రూ॥1000/- చొప్పన 5 సమాన బహుమతులు,

నియమనిబంధనలు:

1) కవిత ఏ అంశానికైనా చెందినదై ఉండవచ్చు,
2) ప్రతి రచయిత ఒక్క కవితమాత్రమే పంపాలి
3)కవిత 20 లైన్లకు తగ్గకుండా 30లైన్లకు మించకుండా ఉండాలి.
4)కవిత ఇంతకుముందు ఎక్కడా ప్రచురితం/ప్రసారితం కాలేదనీ, దేనికీ అనుకరణ/అనువాదం కాదనీ, ఏ బ్లాగులోనూ పెట్టలేదనీ, మరెక్కడా పరిశీలనలో లేదనీ హామీపత్రం తప్పనిసరిగా జతపరచాలి,
5)కవిత పంపే కవరుమీద జాహ్నవి కొసరాజు (అన్యతాసి) స్మారక జాతీయస్థాయి కవితలపోటీకి అని రాయాలి,
6)కవి పేరు, చిరునామా, మొబైల్ నెంబరు కవిత ఉన్న పేపరుపై కాకుండా హామీపత్రంపై రాయాలి,
7)కవితలు పోస్టు/కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి, వాట్సప్, మెయిల్‌లో పంపిన కవితలు స్వీకరించబడవు,
8)కవిత ఎ4సైజు తెల్ల కాగితానికి ఒకవైపు మాత్రమే రాయాలి,
9) కవితలు 30.06.2022 లోపు క్రింది చిరునామాకు పంపాలి.

చిరునామా: ఇం.నెం.11-13-154, అలకాపురి,
రోడ్ నెం.3, హైదరాబాద్-500102. సెల్:9490751681

బహుమతి ప్రదాత
సామ్రాజ్యం కొసరాజు

పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు

# భుకుగ్రామానికి పునాదులు కుటుంబాలే..!

(15 మే 'అంతర్జాతీయ కుటుంబ దినం' సందర్భంగా)

భూకుగ్రామానికి పునాదులు కుటుంబాలు. వసుదైక కుటుంబ సౌభాగ్యానికి సకల మూలాలు కుటుంబాలు. అమ్మానాన్నలు, కుటుంబం లేని వారుండరు. కుటుంబం అంటే నాలుగు గోడల నడుమ ఉన్న గదులు కాదు. ప్రేమానురాగాల సిమెంటుతో కట్టిన పొదరిల్లు. కుటుంబం అంటే నవ్వులు, అనుబంధాలు, ఆప్యాయతలు, బాధలు, బాధ్యతలు, హక్కులు, సంతోషాల కుప్పలు, గాయాలకు లేపనాలు, సవాళ్ళకు సమాధానాలు, శారీరక మానసిక వికాస సోపానాలు, కష్టసుఖాల సమతుల్యతలు, అమ్మ లాలనలు, నాన్న నిర్దేశాలు, సమాజాభివృద్ధికి మూల స్తంభాలు.నాటి నుంచి నేటి వరకు కుటుంబాలు కాలక్రమంలో పెను మార్పులకు లోనవుతూ ఉన్నప్పటికీ కుటుంబానికి ప్రత్యామ్నాయం లేదు. ఉమ్మడి కుటుంబాలు అంతరిస్తూ న్యూక్లియర్ ఫామిలీలు వెలుస్తున్నాయి. డిజిటల్ యుగంలో కుటుంబం అంటే అమ్మానాన్న, ఒకరిద్దరు పిల్లలుగా కుచించుకు పోయింది. నాన్న నాయకత్వం, అమ్మ అమృత హస్తం నీడన ఎదిగిన పిల్లలు జాతిరత్నాలు అవుతారు. అమ్మానాన్ననలను గౌరవించక, అపహాస్యం చేసే పిల్లలు చరిత్ర హీనులు అవుతారు. ఆది గురువులుగా తల్లితండ్రులు పిల్లల మనసుల్లో మానవీయ విత్తులు నాటుతారు. సంతోషాలతో నిండిన గృహాలు దేశాభివృద్ధికి గీటురాళ్ళు. అస్థిర కుటుంబాలు అశాంతికి నెలవులు. సమాజ దేహానికి కుటుంబాలే అస్థిపంజర పటిష్ట వ్యవస్థలు, కుటుంబ సభ్యులే అవయవాలు.ఇండియాలో పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ నెలకొని ఉంటూ ఆర్థిక స్థితిని బట్టి ధనిక, మధ్య తరగతి, పేదరిక కుటుంబాలుగా వర్గీకరించబడి ఉన్నాయి. .

ప్రపంచ మానవాళి సమగ్రాభివృద్ధిలో కుటుంబాల ప్రాధాన్యతలను గుర్తించిన ఐక్యరాజ్యసమితి 1994లో 'అంతర్జాతీయ కుటుంబ దినం (ఇంటర్నేషనల్ ఫామిలి డే)'ను ప్రతి ఏటా 15 మే రోజున పాటించుటకు నిర్ణయం తీసుకుంది. సమాజానికి యూనిట్ కుటుంబమని, కుటుంబ అభివృద్ధే సమాజ అభివృద్ధిని నమ్మిన ఐరాస ప్రతి ఏటా ఒక ప్రత్యేక నినాదంతో ఈ దినోత్సవాన్ని జరుపుకొనుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ కుటుంబ దినం – 2022 నినాదంగా 'వన్ డే ఆఫ్ పీస్' అనే అంశాన్ని తీసుకున్నారు. తల్లితండ్రులు తమ పిల్లల సమగ్రాభివృద్ధికి జీవితాలను ధార పోస్తారు. చిన్నారుల శారీరక మానసిక విలాసానికి కుటుంబ వాతావరణం దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, అవిద్య, నిరుద్యోగాల వంటి సవాళ్ళను అధిగమించడానికి కుటుంబ వ్యక్తులు ప్రధాన కారకులు అవుతారు. కుటుంబ అభివృద్ధికి సాంఘీక, ఆర్థిక, జనాభా లాంటి అంశాలు ప్రభావితం చేస్తాయి. కుటుంబాన్ని బలీయం చేసినపుడు సమాజం నెలకొన్న అన్ని సమస్యలు సమిసిపోతాయి. కుటుంబ సభ్యుల్లో అమ్మానాన్నల మధ్య జీవిత బంధం, పిల్లలతో ప్రేమానురాగాల సంబంధం, పిల్లల మధ్య సోదర రక్తసంబంధాలు పటిష్టంగా నెలకొని ఉంటాయి. అంతర్జాతీయ కుటుంబ దినం వేదికగా వ్యక్తి సమగ్రాభివృద్ధిలో కుటుంబాల ప్రాధాన్యతలను వివరించడం, కుటుంబ సభ్యులు కలిసి ఆటపాటలతో సంతోషంగా గడపడం, విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం లాంటివి పాటిస్తారు. సమాజాభివృద్ధికి కుటుంబమే సోపానంగా నిలుస్తుంది. కుటుంబ విచ్ఛిన్నంతో కుటుంబ సభ్యుల మనసులు విరిగినట్లు భావించాలి. ఉన్నత విలువలు, సామాజిక సంఘీభావాలకు కుటుంబ వ్యవస్థ అతి ప్రధానమైనది. కుటుంబాల ప్రగతికి ప్రభుత్వాలు కూడా ప్రధాన భూమికను నిర్వహించాలి.

భారతీయ కుటుంబ వ్యవస్థలో ఉమ్మడి కుటుంబాల సంస్కృతి ప్రధానమైనది. ఒకే కుటుంబంలో 3 – 4 తరాల సభ్యులు (తాతలు, బామ్మలు, బాబాయిలు, పిన్నులు, మనుమలు, మనుమరాండ్రు, సోదర సోదరీమణులు, బావలు, మరదులు లాంటి సమీప సంబంధీకులు) ఒకే గొడుగు కింద కుటుంబ సభ్యులుగా జీవించగలగడం ఓ అపురూప భావన. మన దేశంలో నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్–నానో యుగం వరకు కుటుంబ వ్యవస్థలో కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ఉమ్మడి కుటుంబాలు, న్యూక్లియర్ ఫామిలీలు, సరళ కుటుంబాలు భాగమై ఉన్నాయి. వీటికి తోడు నేటి ఆధునిక యుగంలో ప్రేమజంటల సహజీవనాలు, సింగిల్ పేరంట్ కుటుంబాలు, పిల్లలు లేని కుటుంబాలు లాంటి విపరీత వ్యవస్థలు కూడా రావడం విచారకరం. భారతీయ సగటు కుటుంబంలో 4 – 5 (కుటుంబ పరిమాణం 4.6) సభ్యులు ఉంటున్నారు.

భారతీయ కుటుంబ పుణాదులుగా విధేయత, సమగ్రత, ఐక్యత గుర్తించబడినవి. భారతదేశంలోని దాదాపు 138 కోట్ల జనాభాతో 25 కోట్ల కుటుంబాలు ఉన్నాయని అంచనా. వీటిలో 20 కోట్లు హిందూ, 3 కోట్ల ముస్లిమ్, 6.3 మిలియన్ల క్రిస్టియన్, 4.1 మిలియన్ల సిక్కు, 1.9 మిలియన్ల జైనులకా పాటు ఇతర మతాలకు చెందిన కుటుంబాలు ఉన్నాయి. భారత్‌లో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, విద్య, మహిళాసాధికారత, పాశ్చాత్య ధోరిణి, వివాహ వ్యవస్థలో మార్పులు, సామాజిక విలువల్లో మార్పులు, వ్యవసాయ, గ్రామీణ పరిశ్రమలు తగ్గడం లాంటి ప్రధాన కారణాలతో కుటుంబ వ్యవస్థల్లో పెను మార్పులు వస్తున్నాయి. స్వల్ప విభేదాలతో విడిపోవడంతే సింగిల్ ఫాదర్ లేదా సింగిల్ మదర్‌తో పిల్లలు ఎదగడం లాంటివని భారతీయ కుటుంబ వ్యవస్థను పరిహాసం చేస్తున్నాయి. నేటి పిల్లలే రేపటి తల్లితండ్రులని మరువరాదు. న్యూక్లియర్, సింగిల్ పేరంట్ కుటుంబాలు పెరుగుతున్న డిజిటల్ కాలంలో పిల్లలకు సామాజిక అవగాహన, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం జరగడం లేదు. పిల్లల్లో పేరెంట్స్ పట్ల నిర్లక్ష్యం, చులకన భావం పెరిగి, అనేక దురలవాట్ల నడుమ సంఘ వ్యతిరేక శక్తులుగా మారే ప్రమాదకర దుస్థితిలో భారత సమాజం నేడు ఉన్నది. కుటుంబాలను సౌభాగ్య కోవెలలుగా, అమ్మానాన్నల్ని ఆది దేవతలుగా భావిస్తూ, భరతమాత నుదుట సంతోష తిలకం దిద్దుదాం. కుటుంబ విలువలకు కలకాలం పట్టం కడుతూ గృహాన్ని స్వర్గసీమగా మలుచుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# మూడు రాజధానుల అంశం ఉత్తుత్తిదే : జీవీఎల్ ఎద్దేవా

అమరావతి, మే 14:ఏపీలోని మూడు రాజధానుల అంశం ఉత్తుత్తి మాటేనని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహా రావు అన్నారు. మూడు రాజధానులంటూ జగన్ ప్రభుత్వం ముందుకెళ్లదని, ఆ దిశగా కూడా ఆలోచించడం లేదని జీవీఎల్ పేర్కొన్నారు. ఇది సాధ్యమయ్యే పనికూడా కాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తన బాధ్యతను విస్మరిస్తే ప్రజలు కోర్టును ఆశ్రయించే అవకాశాలున్నాయన్నారు.

రాజకీయంగా లాభం పొందడం కోసమే ఏపీ ప్రభుత్వం మూడు రాజధానుల అంశాన్ని పదే పదే ప్రస్తావిస్తోందని జీవీఎల్ విమర్శించారు. రైతులను మోసం చేసి, ఈ నినాదాన్ని ఇంకా రాజకీయం కోసం వాడుకుంటే, రైతులను మోసం చేస్తే వారికే బెడిసి కొడుతుందని హెచ్చరించారు.

ఈ మూడు రాజధానుల అంశం ప్రాక్టికల్‌గా సాధ్యం కాని పని అని వైసీపీకి కూడా తెలుసని, అందుకే గతంలో మూడు రాజధానుల బిల్లును జగన్ సర్కార్ వెనక్కి తీసుకుందని జీవీఎల్ గుర్తు చేశారు. మూడు రాజధానులకు సంబంధించి, సవరణ బిల్లును గనక తేవాలన్న ఉద్దేశం ఏపీ ప్రభుత్వానికి ఉంటే, మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లోనే తెచ్చేవారని, ఎందుకు తేలేదని ప్రశ్నించారు. కేవలం రాజకీయ ఉపన్యాసాల కోసమే ఈ అంశాన్ని వాడుకుంటున్నారని జీవీఎల్ మండిపడ్డారు.

# దేశ ఆర్థిక వ్యవస్థ గంగలో కలిసింది- వెంటనే సెట్ చేయండి : చిదంబరం

న్యూఢిల్లీ, మే 14:దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయ స్థితికి పడిపోయిందని కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం విమర్శించారు. ఆర్థిక విధానాలను వెంటనే మార్చాలని ఆయన సూచించారు. ప్రపంచ, దేశీయ పరిణామాలను లెక్కలకు తీసుకొని, విధానాలను మార్చాలన్నారు.

సంకల్ప్ చింతన్ శిబిర్ వేదికగా చిదంబరం శనివారం విలేకరులతో మాట్లాడారు. వృద్ధిరేటు మందగమనంతో ఉందని, ఇదే మోదీ ప్రభుత్వం హాల్‌మార్క్‌గా మారిపోయిందని చిదంబరం ఎద్దేవా చేశారు. కరోనా తర్వాత కూడా ఆర్థిక వ్యవస్థ ఇంకా మందగమనంలోనే ఉందని, నిర్లిప్తంగానే వుందన్నారు.

ఇక.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలను కూడా కూలంకషంగా మరోసారి చర్చించుకోవాలని చిదంబరం అభిప్రాయపడ్డారు. జీఎస్టీ విధానాలను అతి పేలవంగా మోదీ సర్కార్ రూపొందించిందని, రూపొందించడమే కాకుండా ఆ విధానాలను 2017 లో అమలు చేసిందన్నారు. వాటి పర్యవసానాలను దేశం అనుభవిస్తోందని చిదంబరం ఎద్దేవా చేశారు.

1991 లో తమ ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానం అన్న కొత్త శకానికి తెర లేపిందని, ఈ సరళీకృత ఆర్థిక విధానాల వల్ల దేశం గొప్ప అభివృద్ధి దిశగా పయనించిందని చిదంబరం గుర్తు చేశారు. సంపద సృష్టి, కొత్త వ్యాపారాలు, నూతన పారిశ్రామిక వేత్తలు, మధ్య తరగతి ప్రజల పెంపు, కొత్త ఉద్యోగాలు? ఇలా ఎన్నో ప్రయోజనాలు సమకూరాయని చిదంబరం చెప్పుకొచ్చారు.

# అరవై రూపాయల భోజనం ఐదు రూపాయలకే



కొండాపూర్, మే 13 : ప్రభుత్వ దవాఖానలకు విచ్చేస్తున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్యంతో పాటు రూ. 5లకే కడుపునిండా భోజనం పెట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్షయపాత్ర, హరేకృష్ణ మూవ్‌మెంట్ కాన్సెస్ (హెచ్‌కేఎంసీ)ల సంయుక్తంగా నిర్వహిస్తున్న రూ. 5ల భోజన కేంద్రాన్ని గురువారం కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో కార్పొరేటర్ హమీద్ పటేల్, దవాఖాన సూపరిండెంట్ డాక్టర్ వరదాచారిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ గాంధీ మాట్లాడుతూ రూ. 60ల విలువ చేసే రుచికరమైన భోజనాన్ని దవాఖానకు విచ్చేసే రోగులు, అటెండర్లకు రోజుకు మూడు పూట లు 365రోజుల పాటు రూ. 5కే అందిస్తున్నట్లు తెలిపా రు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్యాన్ని దృష్టి లో పెట్టుకుని దవాఖాన పరిసరాల్లోనే ఆహారాన్ని మూడు పూటలా అందిస్తున్నామన్నారు.

కొండాపూర్ జిల్లా దవాఖాన రాష్ట్రంలోనే ఉత్తమ దవాఖానగా నిలిచిందని, ఇన్ఫెక్షన్ ఫ్రీ దవాఖానగా కేంద్ర ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్‌ను సైతం పొందినట్లు తెలిపారు. గతంలో నెలకు 20 నుంచి 30 సాధారణ ప్రసవాలు జరిగేవని, ప్రస్తుతం 220 నుంచి 230 సాధారణ ప్రసవాలు జరుగున్నట్లు తెలిపారు. ఇటీవలె ప్రముఖ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద దవాఖానలో ఒక అంతస్తును పూర్తి స్థాయిలో నిర్మించినట్లు తెలిపారు. దవాఖానలో అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు, రోగులకు అవసరమైన అన్ని వైద్య సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఊట్ల క్రిష్ణ, శ్రీనివాస్ యాదవ్, క్రిష్ణ గౌడ్, చాంద్‌పాషా, దవాఖాన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పుడు బియ్యాన్ని(పారాబాయిల్డ్ రైస్) ఎఫ్ సి ఐ లో డిపాజిట్ చేయడానికి తెలంగాణ రాష్ట్రానికి అనుమతి ఇచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ, మే 14:కెఎంఎస్ 2020 –21 మరియు కెఎంఎస్ 2021–22 మిగిలిన వరిలో 6.05 ఎల్ఎంటీ ల ఉప్పుడు పొట్టు బియ్యాన్ని ఎఫ్ సి ఐ లో డిపాజిట్ చేయడానికి తెలంగాణ రాష్ట్రానికి అనుమతి ఇస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం నుంచి అందిన అభ్యర్థన మేరకు కేంద్రం దీనికి సంబంధించి 11.05.2022న లేఖ జారీ చేసింది. కెఎంఎస్ 2020–21 (రబీ) కాలంలో కస్టమ్డ్ మిల్డ్ రైస్ మిల్లింగ్/ సరఫరా కోసం తొలుత 2021 సెప్టెంబర్ వరకు గడువు గా నిర్ణయించారు. అయితే, తెలంగాణ నుంచి అందిన అభ్యర్థన మేరకు 04.05.2022న విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు గడువును 2022 మే వరకు పొడిగించడం జరిగింది. కెఎంఎస్ (రబీ పంటలు) 2021–22 లో తెలంగాణలో 40.20 ఎంటీల వరిని 2022 జూన్ నాటికి సేకరించేందుకు అనుమతి ఇచ్చిన కేంద్రం దీని మిల్లింగ్ గడువును 2022 సెప్టెంబర్ గా నిర్ణయించింది. తెలంగాణ నుంచి 13.04.2022 తేదీన అందిన అభ్యర్థన మేరకు సేకరణ అంచనాలను 18.04.2022 నాటి లేఖలో కేంద్ర ఆహార ప్రజా పంపిణీ శాఖ ఆమోదించింది.

తెలంగాణ తో సహా అన్ని రాష్ట్రాల్లో సేకరణ కార్యకలాపాలకు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో వరి సేకరణ గణనీయంగా పెరిగింది. కెఎంఎస్ 2015–16 కాలంలో 5,35,007 మంది రైతులకు ప్రయోజనం కల్పిస్తూ 3,417.15 కోట్ల రూపాయల విలువ చేసే 15.79 ఎల్ఎంటీ వరి సేకరణ జరిగింది. దీనితో పోల్చి చూస్తే తెలంగాణలో కెఎంఎస్ 2020–21 కాలంలో 21,64,354 మంది రైతుల నుంచి 26,637.39 కోట్ల రూపాయల విలువ చేసే 94.53 ఎల్ఎంటీ వరి సేకరణ జరిగింది.

కొనసాగుతున్న కెఎంఎస్ 2021–22 కాలంలో 11.05.2022 నాటికి తెలంగాణలో 72.71 ఎల్ఎంటీ వరి (48.72 ఎల్ఎంటీ సమానమైన బియ్యం) కొనుగోలు చేయడం ద్వారా 11,14,833 మంది రైతులకు కనీస మద్దతు ధర రూపంలో 14251.59 కోట్ల రూపాయలను చెల్లించడం జరిగింది.

# రెండు టర్మ్‌లే 'పెద్దల సభకు'.. అన్ని పోస్టులకూ 'కాల పరిమితి' విధించనున్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, మే 14:సంకల్ప్ చింతన్ శిబిర్ వేదికగా కాంగ్రెస్ మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. ఇకపై? రాజ్యసభకు ఎవరైనా రెండు టర్మ్‌లు మాత్రమే నామినేట్ చేయాలన్న ప్రతిపాదనలు తీసుకురానుంది. ఎంతటి కీలక వ్యక్తి అయినా సరే.. రెండు టర్ముల తర్వాత ఇక రాజ్యసభకు నామినేట్ చేయకూడదని దాదాపుగా ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ మేరకు సంస్థాగత వ్యవహారాల ప్యానల్ కసరత్తు ప్రారంభించింది.

ఈ విషయంపై సీడబ్ల్యూసీ సభ్యుడొకరు మాట్లాడుతూ? ఈ విషయం మా ప్యానల్ చర్చకు వచ్చింది. ఇప్పటి నుంచి రెండు సార్లు మాత్రమే ఓ వ్యక్తిని రాజ్యసభకు నామినేట్ చేయాలన్న చర్చ వచ్చింది. ఈ రాజ్యసభ కాల పరిమితి పూర్తైన తర్వాత సదురు సభ్యుడు తనకు నచ్చితే లోక్‌సభకు గానీ, అసెంబ్లీకి గానీ పోటీ చేసుకోవచ్చు. అంతేకానీ.. మూడోసారి మాత్రం రాజ్య సభకు ఆయన్ను నామినేట్ చేయం అన్న నిర్ణయానికి దాదాపుగా వచ్చావ న్నారు.



**రాజ్యసభకే కాదు.. వీటికి కూడా కాలపరమితే..**

ఇక పై రాజ్యసభకు మాత్రమే కాలపరిమితి విధించడం లేదని, దీనితో పాటు ఆఫీస్ బేరర్స్ అందరికీ తమ తమ పదవుల విషయంలో ఓ కాలపరిమితి విధించనున్నారు. ఈ నిబంధన బ్లాక్ స్థాయి నుంచి మొదలుపెడితే ఏఐసీసీ స్థాయి వరకూ వర్తింపజేయనున్నారు. ఐదేళ్లు మాత్రమే ఆయా పదవుల్లో ఉండేలా నిబంధన పెట్టనున్నారు.

**కాల పరిమితి దాటితే రాజీనామా?**

బ్లాక్ నుంచి మొదలు పెడితే ఏఐసీసీ వరకూ ఉన్న పోస్టుల్లో ఓ కాల పరిమితి తేవాలన్న చర్చ చింతన్ శిబిర్‌లో సాగుతోంది. ఐదేళ్ల పాటు సదురు సభ్యుడు తనకిచ్చిన పదవిలో వుంటారు. ఐదేళ్లు పూర్తి కాగానే స్వతహాగా ఆయన తన పదవికి రాజీనామా చేసేయాలని నిబంధన తేనున్నారు. ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాత సదురు సభ్యుడికి మరో బాధ్యత అప్పజెప్పనున్నారు.

# దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో స్నాతకోత్సవం

హైదరాబాద్, మే 14: దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో 7వ బ్యాచ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమం స్నాతకోత్సవం జరిగింది. తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, నాగాలాండ్ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు గత 18 నెలలుగా ఎఫ్‌ఆర్‌ఓలు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు, వివిధ అంశాల్లో శిక్షణ కనబరిచిన అధికారులకు వెండి, బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమానికి పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జరిగిన శిక్షణ అధికారులు పరేడ్ నిర్వహించగా, వందనం స్వీకరించారు. ఆ తర్వాత స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. 18 నెలల శిక్షణా కార్యక్రమంలో తాము చాలా విషయాలు నేర్చుకున్నామని, వృత్తిలో రాణించడానికి, వ్యక్తిగత జీవితంలో శిక్షణ ఎంతో దోహదపడుతుందని శిక్షణ పొందిన అధికారులు పేర్కొన్నారు. అటవీ సంరక్షణలో తమ వంతు కృషి చేస్తామన్నారు. వ్యవస్థాగతంగా, వృత్తి శిక్షణలో దేశంలోనే మేటిగానున్న తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందడం గర్వంగా ఉందని, అకాడమీ పేరు నిలబెట్టే విధంగా పని చేస్తూ, వృత్తికి న్యాయం చేస్తామన్నారు.



శిక్షణలో తమిళనాడుకు చెందిన దీప నాలుగు బంగారు పతకాలు, రెండు సిల్వర్ పతకాలతో బ్యాచ్ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ డోబ్రియాల్ మాట్లాడుతూ అటవీశాఖలో ఎఫ్‌ఆర్‌ఓ ఉద్యోగం కీలకమైందని, శాఖకు వెన్నెముక వంటిదన్నారు. అకాడమీ శిక్షణను పునాదిగా భావించి క్షేత్ర స్థాయిలో అడవులను కాపాడుతూ వృత్తిని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో స్వర్గం శ్రీనివాస్, అటవీ ప్రధాన ముఖ్య సంరక్షణాధికారి, పీవీ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన సునీల్ జాఖడ్

న్యూఢిల్లీ, మే 14:ఓ వైపు చింతన్ శిబిర్ పేర.. పార్టీని రిపేర్ చేస్తున్న సమయంలోనే పంజాబ్‌లో కాంగ్రెస్‌కు ఝలక్ తగిలింది. పార్టీ సీనియర్ నేత, పీసీసీ మాజీ అధ్యక్షుడు సునీల్ జాఖడ్ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన ఫేస్‌బుక్ మాధ్యమంగా ప్రకటించారు. గుడ్ లక్.. గుడ్‌బాయ్ కాంగ్రెస్ అంటూ ప్రకటించారు.

ఈ సందర్భంగా హైకమాండ్‌పై సునీల్ జాఖడ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కెప్టెన్ అమరీందర్ సింగ్ పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత? హైకమాండ్ ఒక్కరి మాటే వింటోందని తీవ్రంగా విరుచుకుపడ్డారు. తమ కుటుంబంలోని మూడు తరాల వారు కాంగ్రెస్‌కు సేవలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అయితే.. తాను పార్టీ విధి విధానాల ప్రకారం నడుచుకోలేదని, అన్ని పదవులను తన నుంచి లాగేసుకున్నారని ఆయన ఆరోపించారు. దీంతో కాంగ్రెస్‌పై మనసు విరిగిపోయిందని సునీల్ జాఖడ్ వివరించారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ పంజాబ్ సీనియర్ నేత సునీల్ జాఖడ్‌కు పార్టీ ఝలక్ ఇచ్చింది. ఆయనను అన్ని పార్టీ పదవుల నుంచి తొలగిస్తున్నట్లు కీలక ప్రకటన చేసింది. ఈయనతో పాటు కేరళ సీనియర్ నేత కేవీ థామస్‌పై కూడా ఇదే రకమైన చర్యలు తీసుకుంది. పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ ఏకే ఆంటోనీ సిఫార్సు మేరకు సోనియా గాంధీ వాటికి ఆమోద ముద్ర వేసింది.

ఎన్నికల సమయంలోనూ సంచలన వ్యాఖ్యలు

పంజాబ్ రాష్ట్ర ఎన్నికల తేదీలు ఖరారైన సమయం నుంచీ సునీల్ జాఖడ్ సంచలన వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి పదవికి తన పేరు పరిశీలించాలని అధిష్ఠానాన్ని బహిరంగంగానే డిమాండ్ చేశారు. అంతేకాకుండా హైకమాండ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఓ హిందువునని, అందుకే తన పేరును ముఖ్యమంత్రి పదవికి హైకమాండ్ పరిశీలించడం లేదని కూడా సంచలన ఆరోపణలు చేశారు.

# మేడ్చల్‌లో కొవిడ్ దృష్ట్యా పెరిగిన పరీక్షా కేంద్రాలు



హైదరాబాద్, మే 14: కరోనా కారణంగా రెండేండ్లు పది పరీక్షలు జరుగలేదు. ఈసారి కరోనా ప్రభావం అంతగా లేకపోవడంతో పరీక్షలు నిర్వహించడానికి విద్యాశాఖ సిద్ధమైంది. అయితే కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఒక్కో కేంద్రానికి పరీక్ష రాయడానికి కేటాయించిన విద్యార్థుల సంఖ్యను తగ్గించారు. తగ్గించిన విద్యార్థులకు అనుగుణంగా కొత్త కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 23 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

## ఆరు కొత్త కేంద్రాలు..

గతంలో ఒక్కో పరీక్షా కేంద్రానికి ఉన్న సౌకర్యాల దృష్ట్యా 220 నుంచి 250 మంది విద్యార్థులకు కేటాయించే వారు. ఈ సారి ఆ సంఖ్యను కుదించారు. అందుకనుగుణంగా కేంద్రాల సంఖ్యను పెంచారు. మేడ్చల్‌లో గతంలో 9 కేంద్రాలు ఉండగా ఈ సారి ఆరు కొత్త కేంద్రాలను ఏర్పాటు చేశారు. గౌడవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డబిల్‌పూర్ నాజిరేన్ గ్రామర్ స్కూల్, మేడ్చల్ పట్టణంలోని ఎస్ఎస్‌జీ స్కూల్, శ్రీ వివేకానంద విద్యాలయ హైస్కూల్, సెయింట్ ఆన్స్, నాగార్జున టాలెంట్ స్కూల్ లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## గరిష్టంగా 180 మంది విద్యార్థులు..

గతంలో 220 నుంచి 250 మందిని కేటాయించిన పరీక్షా కేంద్రానికి ఈ సారి 180 మంది విద్యార్థులనుకేటాయించారు. గరిష్టంగా 180 మందిని కనిష్టంగా 110 మంది విద్యార్థులను కేటాయించారు. మొత్తం 2330 మంది విద్యార్థులు 15 కేంద్రాల్లో పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నాం..

పకడ్బందీగా పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. కొవిడ్ నిబంధనల దృష్ట్యా పరీక్షా కేంద్రాల సంఖ్యను పెంచాం. పాత, కొత్త కేంద్రాలను సందర్శిస్తూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసే సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం.ప్రతి కేంద్రంలో కొవిడ్ నిబంధలకనుగుణంగా బెంచీకి ఒకరి చొప్పున కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు శానిటైజర్, మాస్క్‌ను విధిగా వినియోగించాలి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

